# షార్ మొదటి డైరెక్టర్ వై.జె.రావు కన్నుమూత

## - పలువురు ఇస్రో శాస్త్రవేత్తల సంతాపం



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 10 ప్రభాతవార్త : శ్రీహరికోట దీవిని అంతరిక్ష కేంద్రంగా అభివృద్ధి చేసిన తొలితరం శాస్త్రవేత్తల్లో ఒకరైన వై.జనార్ధన్‌రావు (94) సోమవారం మృతిచెందినట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి. వై.జె.రావుగా ప్రసిద్ధి చెందిన ఆయన తన కుమార్తెతో పాటు అమెరికాలో ఉంటున్నారు. వృద్ధాప్య, అనారోగ్య సమస్యల కారణంగా వై.జె.రావు మృతిచెందారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెల్లు గ్రామానికి చెందిన వై.జె.రావు మృతి పట్ల ఇస్రో శాస్త్రవేత్తలు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన తొలితరం శాస్త్రవేత్తల్లో ఒకరిగా ఆయన గుర్తింపు పొందారు. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారా భాయ్ ఆధ్వర్యంలో షార్‌లో రాకెట్ కేంద్రం ఏర్పాటు సమయాన వై.జె.రావు కీలకపాత్ర పోషించారు. 1972 నుంచి 1977 వరకు మొదటి షార్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. అంతకుముందు తిరువనంతపురంలోని స్పేస్ సెంటర్‌లో ఆయన శాస్త్రవేత్తగా పనిచేశారు.

# ఎరువు... మరింత బరువు

కోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : రబీ సీజన్‌లో అన్నదాతలకు ఎరువుల ధరలు భారం కానున్నాయి. యూరియా మినహా ఇతర పరిశ్రమల ఎరువుల ధరలు పెరగడంతో ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయక తప్పని పరిస్థితి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ పెరగడంతో ఈ ప్రభావం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పాస్ఫరిక్ ఆమ్లం, అమోనియా వంటి ముడి సరుకులపై పడిందని, ఇదే కొన్ని రకాల మిశ్రమ ఎరువుల ధరలు పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. ఖరీఫ్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో పెద్దగా ఎరువుల అవసరం రాలేదు. రబీ సాగులో మిశ్రమ ఎరువులను ఎక్కువగా వినియోగించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. డిఏపీ మాత్రం రైతులకు అందుబాటులో లేదు. మార్కెట్లో రైతులకు అవసరమైన ఎరువులు ఉన్నా ప్రైవేటు డీలర్లు స్టాకు లేదని రైతులకు చెప్తున్నారు. వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రైతులకు సరసమైన ధరలకు ఎరువులు అందేలా చూడాలని కోరుతున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### నేతమ్స్ షుగర్స్ పరిధిలోని మండలాలు...

# ఎస్ఎస్‌జే షుగర్స్‌కు కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు డిప్యూటీ కేన్ కమిషనర్

నగరి, డిసెంబరు 10 ప్రభాతవార్త: నేతమ్స్ షుగర్స్ పరిధిలో ఇదివరలో చెరకు సాగు చేస్తున్న మండలాలను ఆంధ్రప్రదేశ్ కేన్ కమిషనర్ అమరావతి వారు నెలవాయిలోని ఎస్ఎస్‌జే షుగర్స్ కు కేటాయించినట్టు చిత్తూరు డిప్యూటీ కేన్ కమిషనర్ జాన్ విక్టర్ తెలిపారు. మంగళవారం నగరి డివిజన్ చెరకు రైతుల సమావేశంలో ఆయన ఈ మేరకు వివరాలు తెలియజేశారు. గత 5 సంవత్సరాలుగా నింద్ర మండలంలోని నేతమ్స్ షుగర్స్ ప్రైవేటు లిమిటెడ్, ఫ్యాక్టరీ మూతబడి ఉన్నందున స్థానిక వినతి మేరకు నేతమ్స్ షుగర్స్ పరిధిలోని చెరకు సాగు మండలాలైన పుత్తూరు, నారాయణవనం, నింద్ర, నాగలాపురం, కేవీబీపురం, విజయపురం, నగరి, పిచ్చాటూరు మండలాలను నెలవాయిలోని ఎస్ఎస్‌జే షుగర్స్ అండ్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ వారికి తాత్కాలికంగా కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాంత చెరకు రైతులందరూ ఇది గమనించాలని, ఇతర రాష్ట్రాలకు చెరకు సరఫరా చేసి నష్టపోనవసరం లేదన్నారు. ఇకపై ఎస్ఎస్‌జే షుగర్స్ లోనే ఒక వరుస క్రమంలో ప్రియారిటీ ప్రకారం కటింగ్ పర్మిట్లు పొంది చెరకు సరఫరా చేసుకోవచ్చున్నారు. ఫ్యాక్టరీ వారు కూడా అక్కడి రైతులకు అందించే అన్ని సౌకర్యాలను, సౌలభ్యాలు ఈ మండలాల రైతులకు కూడా అందుతుందన్నారు. చెరకు పేమెంట్ల విషయంలో రైతులకు ఎక్కడ కూడా ఇబ్బంది రాకుండా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మేనేజ్‌మెంట్ కూడా సూచించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జే షుగర్స్ వైస్ ప్రెసిడెంట్ సి.రాధాకృష్ణన్, అడ్వయిజర్ కేన్ ఎం.కృష్ణన్, ఏజీఎం కేన్ కె.వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎం ఇలాఖాలో...

# గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

**- 20 కోట్లతో సిసి రోడ్లు, 5కోట్లతో గోకులం షెడ్లు, 3.73కోట్లతో రక్షిత మంచినీటి బోర్లు !! - తాజాగా డ్రైన నిర్మాణాలకు మరో 110 కోట్లు మంజూరు**

కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త : ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధిని సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం నుంచే 'గాడిన' పెడుతున్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందని బలంగా విశ్వసించే సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో అత్యధిక ంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిం చారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పండగ వాతావరణంలో జరుగుతున్నాయి. నియోజకవర్గంలో దాదాపు 89 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లోను అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేర కురవకపోవడంతో నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటిం చింది. ఈ నేపథ్యంలో

నియోజకవర్గంలో ఉన్న 118 గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా తాగునీటి బోర్లు వేయించేందుకు ప్రభుత్వం 3.73కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో నీటి సమస్య ఉన్న గ్రామాల్లో కొత్తగా బోర్లను డ్రిల్ చేస్తున్నారు. వేసవిని ధీటుగా ఎదుర్కొనేలా గ్రామాల్లో బోర్లకు అనుమతులు మంజూరు చేశారు. ఇక వైకాపా పాలనలో గుంతలు పడ్డ రోడ్లకు తట్టమట్టి వేసే నాథుడు లేకపోయారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో 1.36కోట్ల నిధులతో రోడ్ల మరమ్మతు పనులు మొదలయ్యాయి.



కొత్తపల్లిలో నిర్మించిన గోకులంషెడ్.. చెక్కునత్తంలో వేసిన కొత్త బోరు

**25 కోట్ల నిధులతో సిసి రోడ్లు, గోకులం షెడ్లు :**

కుప్పం నియోజకవర్గంలో రోడ్డు సౌకర్య ం లేని గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. దీంతో దాదాపు 25 కిలోమీటర్ల మేర నియోజకవర్గంలో 25 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద ఈ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో దాదాపు రోడ్ల సమస్య తీరినట్లే. ఇక పాడి రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి తొలివిడతగా 501 గోకులం షెడ్లను మంజూరు చేశారు. ఈ షెడ్లను రైతులు తమ పాడి ఆవులు, గొర్రెలు, కోళ్లకు ఆవాసంగా మార్చుకుంటున్నారు. వీటి నిర్మాణానికి సైతం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపాధి నిధుల ద్వారా రాయితీ కల్పిస్తోంది. ఈ షెడ్ల నిర్మాణాలు సైతం దాదాపు 5 కోట్ల నిధులతో జరుగుతున్నాయి. దీనిపై పాడి రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండో విడతలో మరిన్ని గోకులం షెడ్లను పాడి రైతులకు మంజూరుచేస్తారు.

**మురుగునీటి కాలువల నిర్మాణాలకు మరో 110 కోట్లు :**

కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అవసరమైన చోట్ల డ్రైనేజీల నిర్మాణాలకు గాను ఎస్‌డిపి నిధుల ద్వారా ప్రభుత్వం 110 కోట్ల నిధులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇవికాకుండా త్వరలోనే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏది ఏమైనా సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరుచేస్తూ కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటున్నారు.

# గోకులం షెడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

## - కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

చిత్తూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: పాడి పశువుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గోకులం షెడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతిపై పశుసంవర్ధకశాఖ ఎడిలు, ఉపాధి ఎపిడిలు, ఎపిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ పాడి పశువుల పెంపకానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గోకులం షెడ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయడానికి పశుసంవర్ధకశాఖ అధికారులు, ఎపిడిలు, ఎపిఓలు సమన్వయంతో విధులు నిర్వర్తించి మండలాలకు నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే గోకులం షెడ్లు మంజూరై పనులు ప్రారంభించని వారిని గుర్తించి పది రోజుల్లో పనులు ప్రారంభించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. లేనిపక్షంలో మంజూరైన షెడ్లు రద్దు చేయడం జరుగుతుంద న్నారు. షెడ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే ఎంబుక్ రికార్డు చేసి బిల్లులు ఆప్‌లోడ్ చేయాలని దీనికి నిధుల కొరత లేదన్నారు. బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ కావడం జరుగుతుందన్నారు. ఈ విషయం లబ్దిదారులకు వివరిస్తే షెడ్ల నిర్మాణాలు త్వరితంగా ప్రారంభిస్తారన్నారు. అలాగే మండలానికి మంజూరైన గోకులం షెడ్లలో నిర్మాణాలు చేపట్టని చోట వాటిని రద్దు చేసి ఆసక్తి వున్న వారికి మంజూరు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణాలపై గ్రామసభలు నిర్వహించి ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అవగాహన తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం :**

ఆర్‌సిహెచ్‌ఎస్ పోర్టల్‌లో తల్లి, పిల్లల రిజిస్ట్రేషన్లు తక్కువగా వుండటానికిగల కారణాలు ఏమిటని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ నుండి మంగళవారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతితో కలసి మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ఈ డేటాను వెంటనే అప్‌లోడ్ చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా క్షేత్ర స్థాయిలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే వారికి ఇచ్చే ప్రోత్సాహకంను సకాలంలో వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా శ్రద్ధ పెట్టాలన్నారు. కాన్పులు తక్కువ చేస్తున్న పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భవతులను త్వరితంగా రిజిస్టర్ చేసి వారికి ఇవ్వాల్సిన అన్ని రకాల సేవలను ఎప్పటికప్పుడు ఇవ్వడం, అన్ని కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా ర్యలు చేపట్టాలన్నారు.

## దెబ్బతిన్న రోడ్లకు సత్వరం మరమ్మతులు : కలెక్టర్

గుడిపాల, డిసెంబర్ 10 ప్రభాతవార్త: గుడిపాల మండలంలో చిత్తూరు– వేలూరు రహదారి ఎంసిఆర్ క్రాస్ నుండి వెళ్తున్న రహదారి దెబ్బతినడంతో సత్వరం మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఎంసిఆర్ క్రాస్ నుండి వెళ్తున్న రహదారి మరమ్మతులకు గురి కావడంతో పత్రికల్లో కథనాలు రావడం, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన మంగళ వారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు. గుంతలమ యమైన రోడ్డును సత్వరం మరమ్మతు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఈ రోడ్డుకు సంబం ధించి సత్వరం ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, గుడిపాల మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, పిఆర్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.గాంధీ, ఎఎస్ మనోహర్‌లు, నాయకులు అనిల్‌కుమార్, హరిప్రసాద్, హేమాద్రి, రూప్‌కుమార్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గుంతల మయమైన రోడ్డును కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

### ఉపాధి పనులలో...

# అవకతవకలకు పాల్పడితే ఇంటికే

**-సామాజిక తనిఖీలో రూ. 2,28.517 లక్షల రుపాయాలు తేడా -ఆడిట్‌లో రూ.87,728 రుపాయాలు రికవరీ -నగదు చెల్లింపులో అవినీతి...గొల్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్ -పారదర్శకంగా ఉపాధిహామీ పనులు చేపట్టండి: పి.డి.**



తిరుపతిరూరల్,డిసెంబర్ 10 ప్రభాతవార్త: ఉపాధిహామి పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని, ఫీల్డ్ అసిస్టెంట్స్ పారదర్శకంగా పనులు చేయాలని డ్వామా పి.డి శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం తిరుపతి రూరల్ ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో 2023 నుండి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులు, 2024 పంచాయతీరాజ్, హౌసింగ్‌లో జరిగిన పనులపై 18వ విడత సామాజిక తనిఖీ, ప్రజావేదికను నిర్వహించారు. సామాజిక తనిఖీలో రూ.2,28,517 రుపాయాలు తేడా వచ్చిందని, సి.మల్ల్వరంలో రూ.87,728 రుపాయాలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగిన కొన్ని పంచాయతీలలో కొలతలలో తేడా వచ్చాయన్నారు. బ్రాహ్మణపట్టు, పాతకాల్వ, గొల్లపల్లి, సి.మల్లవరం, దుర్గసముద్రం, పాతూరు, కొత్తూరు తదితర పంచాయతీలలో చేసిన ఉపాధి పనుల కొలతలలో తేడా వచ్చినట్లు తెలిపారు. తిరుపతిరూరల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదేశించారు.

**సి.గొల్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్:**

సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగాయని గుర్తించి, ఫీల్డ్ అసిస్టెంట్ జి.రమాదేవిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీకి రూ.79,427 రుపాయాలు ఖర్చు అయినట్లు తెలిపారు. ఈ ప్రజావేదికలో ఎంపిపి వేముల యశోధ, జడ్పిటిసి రత్నమ్మ, ఎంపిడిఓ రామచంద్ర, ఎపిఓ మమత, స్టేట్ రిసోర్స్ పర్సన్ పి.రవి, డి.వి.ఓ శివయ్య, 12మంది డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

### రాత్రి వేళల్లో...

# అక్రమ నిర్మాణాలు!

**- అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపై మరణాయుధాలతో దాడి**



తిరుపతిరూరల్,డిసెంబర్ 10 ప్రభాతవార్త: భూ అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. అక్రమనిర్మాణాలు జోలికోస్తే అడ్డంగా చంపడానికైన సిద్ధపడు తున్నారు. భూ అక్రమార్కులు కిరాయిలను అద్దెకు తెచ్చుకుని, రాత్రివేళల్లో చకచక నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డు వచ్చినవారిని ఏమైన చేసే స్థితికి అరాచక శక్తులు తయారైనాయి. సోమవారం రాత్రి తనపల్లి రోడ్డులో స్వర్ణముఖీ నది పరివాహక ప్రాంతంలో రాత్రివేళలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని తొలగించారు. అక్రమ నిర్మాణాలు తొలగించి నందుకు అక్రమార్కులు కోడి కత్తులతో దాడికి యత్నించారని, రెవెన్యూ తమ ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వచ్చినట్లు సమాచారం. ఇకపై తిరుపతిరూరల్లో భూ అక్రమార్కుల నిర్మించే అక్రమ నిర్మాణాల జోలికి వెళ్ళాలంటే పోలీసు బందోబస్త్ తప్పనిసరిగా మారింది. తిరుపతి రూరల్ అవిలాల గ్రామ లెక్క దాఖల ఓటేరు గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 362లో స్వర్ణముఖి తట్టులో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందింది. తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజులనాయక్ ఆదేశాల మేరకు విఆర్వోలు బాబ్జి, యోగనందబాబు, రామిరెడ్డి, వెంకటేష్, సర్వేయర్ జస్వంత్‌లు అక్రమ నిర్మాణాలు తొలగించటానికి వెళ్ళారు. అక్రమ బేస్‌మెంట్‌లను తొలగించి వచ్చే క్రమంలో భూ అక్రమార్కులు అద్దెకు తెచ్చుకున్న కిరాయిలు రెవెన్యూ సిబ్బం దిని అడ్డుకుని కోడి కత్తులతో దాడి చేయటానికి యత్నించారని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలంటే రెవెన్యూ సిబ్బందికి పోలీసు బందోబస్త్ తప్పనిసరిగా మారింది.

**- ఏడు గంగమ్మలను పోటీలు పడి ముస్తాబులు**

### దక్షిణకైలాసంలో...

# 'గంగజాతర' సంబరాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంగా, శైవక్షేత్రంగా ప్రసిద్దిపొందిన దక్షిణకైలాసమైన శ్రీకాళహస్తిలో ప్రతినెలా ఓధార్మిక కార్యక్రమం ప్రత్యేకతగా సాగుతోంది. ఈ ఏడాది జాతరకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి లేదు. దాంతో అన్ని శాసనసభ్యుడేతానై ఇఓ ద్వారా కార్యక్రమాలను రూపకల్పన చేసారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఇఓ టి.బాపిరెడ్డి సారథ్యంలో దేవస్థానం నాలుగుమాడావీధులతో పాటు ముత్యాలమ్మగుడివీధిని దేదీప్యమానంగా విద్యుత్ అలంకరణలు చేసారు. నగరి వీధిలో రోడ్డు చాటింపు శిలకు పూజలు జరిపారు. ఆదివారం రాత్రి కన్నుల పండువగా చాటింపు నిర్వహించారు. నూతనోత్సహంతో యువ కమిటిలు ఏర్పాట్లు చేపట్టారు. దేశంలోనే మంచు కాలం జాతర నిర్వహించే ఒకే ఒక ప్రాంతం శ్రీకాళహస్తి. ఇక్కడ నిర్వహించే ప్రతి ధార్మికకార్యక్రమంలోను దేవస్థానం భాగస్వామ్యం ఉంటోంది. మంచుకాలంలో పండుగనెల ధనుర్మాసం ప్రారంభానికి ముందు నిర్వహించే ఏడు గంగమ్మలజాతర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏ ఏడాది కా ఏడాది జాతర సంబరాల్లో నిర్వాహకులు ప్రత్యేకతను ఆపాదిస్తున్నారు. ఈ ఏడాది నూతన ప్రభుత్వం, శ్రీకాళహస్తిలో కొత్త నాయకుడు, ఆలయానికి కొత్త ఇఓలు ఏర్పాటు చేసిన యువకమిటీల సారథ్యంలో నిర్వహించే జాతరకు శ్రీకారం చుట్టారు. అలంకారాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పదిహేను రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎవరికివారు తమ సొంతింటి కార్యక్రమంగా పాల్గొని సేవలందిస్తున్నారు. సాధారణంగా ఏడాదికోమారు నిర్వహించే కార్యక్రమాలు అప్పటికప్పుడు నిర్వహించి ముగించడం జరుగుతుంది. కానీ, శ్రీకాళహస్తిలోని గంగమ్మ కమిటీ నిర్వాహకులు అమ్మవార్లకు బంగారు వెండినగలను కూడా తయారుచేస్తున్నారు. ముఖ్యంగా పెండ్లిమండపం, సన్నిధివీధి గంగమ్మల నిర్వాహకులు భారీ ఎత్తున అమ్మవార్లకు బంగారు వెండి ఉరువులను తయారుచేయించడం గమనించదగ్గ విషయం. గత కొన్ని సంవత్సరాలుగా ఏడుగంగమ్మలకు దేవస్థానం సారెను అందించే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టి అదో ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. ఏడు గంగమ్మలకు సారెను అందించేందుకు మేళతాళాలు మంగళవాయిద్యాలు ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం మరో అడుగుముందుకు వేసి అన్ని గంగమ్మల వద్ద విద్యుత్ దీపాల అలంకరణలను చేపట్టడం గమనించదగ్గ విషయం. సారెను అందించేందుకు ముత్యాలమ్మగుడివీధిలో మామిడితోరణాలు, అరటిచెట్లతో ఇరువైపులా ముస్తాబులు చేశారు.

**ఎవరికి వారు వినూత్న ఏర్పాట్లు:-**

శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల జాతరలో నూతన కమిటిలు పోటీలు పడి ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం డడప్పుల మోతతో గగుర్పాటుకల్పించారు. గంగమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా రప్పించిన వివిధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు హాజరయ్యారు. ఇక సప్పరాల విషయంలో ఎవరికి వారు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నాలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏడు ప్రాంతాల్లోని గంగమ్మలను ముత్యాలమ్మగుడివీధిలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చి అక్కడ పసుపుముద్దలతో అమ్మవారిని తయారుచేసి దీపం వెలిగించి బలి ఇవ్వడం ఆనవాయితీ. మంగళవారం సాయంత్రానికే చుట్టుపక్కల గ్రామాల నుంచి బంధువులు పట్టణానికి చేరుకున్నారు. అయితే సప్పరాల విషయంలో ఎవరికి వారు ప్రత్యేకతను చోటు చేసుకుంది. రక రకాల సప్పరాను రూపకల్పన చేశారు.



తేరువీధిలోని బాపన వీధి గంగమ్మ విద్యుత్ దీపాల అలంకారం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గంగమ్మ సారెకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోట తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. మంగళవారం కోటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయ రావు మాట్లాడుతూ రైతులు ఏదైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియ జేయాలన్నారు. ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. కోట మండలంలో జరిగే రెవెన్యూ సదస్సులలో రైతులు పాల్గొని సమస్యలు చెప్పుకోవచ్చుని, ఇదొక మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. అనంతరం



తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ రైతులకు సంబంధి ంచిన పొలాల విషయంలో ఎక్కడైనా ముటేషన్లు, 1బి కరెక్షన్లు ఉంటే నేరుగా ఈ సభల్లో అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్మో హన్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, పలగాటి భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్, ఎంపిడిఓ వేణు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లపై ప్రత్యేక నిఘా : డిఎస్పీ



బాలాయపల్లి, డిసెంబర్ 10 ప్రభాతవార్త : సాధారణ తనిఖీలో భాగంగా బాలాయపల్లి పోలీస్ స్టేషన్‌ను గూడూరు డిఎస్పీ ఏవి రమణ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు సమగ్రంగా పరిశీలించారు. ఇప్పటి వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, స్టేషన్ లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు ఎస్సై కామినేని గోపిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. సంక్రాంతి రానున్న దృష్ట్యా పేకాట రాయుళ్లు, కోడిపందాలు ఆడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. చోరీల నివారణపై రాత్రివేళల్లో గస్తీ సూచనలు ఇచ్చారు. డీఎస్పీ వెంట ఎస్సై కామినేని గోపి, సిబ్బంది ఉన్నారు.

## అట్టహాసంగా విద్యార్థులు సోషల్ వీక్

గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు సోషల్ వీక్‌ను అట్టహాసంగా నిర్వహిం చారు. ఇందులో భాగంగా భారతదేశంలో ఉన్నటువంటి 29 రాష్ట్రాలలోని ప్రతి రాష్ట్రంకు సంబంధించినటువంటి విద్యార్థులు ఒక ఎగ్జిబిషన్ రూపంలో రూపొందించి ఘనంగా ప్రదర్శించారు. ఆయా రాష్ట్రాలలో ఉన్నటువంటి గొప్ప కట్టడాలను ఆ రాష్ట్ర భాష యొక్క ప్రాముఖ్యతను ఆ రాష్ట్రంలో ఉన్నటువంటి కళాత్మక నమూనా దృశ్యాలను పూర్తిగా విద్యార్థులే తయారు చేసి ఇక్కడ ప్రదర్శించడం జరిగింది. ఆయా రాష్ట్రాలలో పండించే ఆహారపు అలవాట్లు, వారి యొక్క వివిధ రకాలైనటు వంటి ఆహారపు పదార్థాలను తయారు చేసి తీసుకుని వచ్చి ఇక్కడ ప్రదర్శించి వాటి వాటి ఉపయోగాలను, అవి మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో విద్యార్థులు చక్కగా వివరించారు. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించినటువంటి విద్యార్థులకు తల్లిదండ్రు లకు, మేనేజ్మెంట్‌కు పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్లు శ్రీహరిబాబు, హరి బ్రహ్మ యాదవ్, గాంధీ, ప్రైమరీ ఇంచార్జి చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జి కిరణ్మయిలు పాల్గొన్నారు.




## నాగబాబుకు మంత్రి హోదాపై సంబరాలు



గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుకు రాష్ట్ర క్యాబినెట్లో మంత్రి హోదా కల్పిస్తున్నట్లు సిఎం చంద్ర బాబునాయుడు ప్రకటించడం పట్ల జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ పిఒసి మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగార్జున, వంశీకృష్ణ, సాయి, సనత్, వెంకటేష్,లీగల్ సెల్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

కోట,డిసెంబర్ 10 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కోట మండల విద్యాశాఖధికారి 2 మస్తానయ్య తనిఖీ చేశారు.విద్యార్థుల తో కలిసి డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు.బియ్యం, తదితర నిల్వలను పరిశీలి ంచారు. అనంతరం నాడు నేడు కింది జరుగుతున్న పనులు కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోధ్యాపాయురాలు సోయెకిరణ్మయ ఉన్నారు.



## పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోట,డిసెంబర్ 10 ప్రభాతవార్త : వరి శనగ, మినుము, పెసర, వేరుశనగ, పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని కోట మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని జరుగుమల్లి, తిమ్మానాయుడపాళెం గ్రామలల్లో పోలం పిలుస్తోంది. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు వరికి రూ 168 మినుములు రూ 38 పెసర రూ.36 వేరుశనగ రూ.60 వంతున చెల్లించే బీమా చేయించుకోవాల న్నారు. పంటలు సాగు చేసిన రైతులు ఆధార్ కార్డు, పొలం పట్టాదారు పాసు పుసక్తం బ్యాంకు ఖాతా జెర్నాకు కాఫీలను మీ సేవ కేంద్రాల్లో బీమా చేయించుకోవాలని సూచించారు.

## అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

తడ, డిసెంబర్ 10 ప్రభాతవార్త : తడ మండలం కారూరు పంచాయతీ పరిధిలోని కాసింగాడు కుప్పంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. డిసెంబర్ 10, 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల దినోత్సవాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఉపాధ్యా యులు పిల్లలకు తెలిపారు. ఈ సందర్భంగా హక్కులు, మానవ విధులను గురించి పలువురు విద్యార్థులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు పి.రఘురామయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గ్రద్దగుంట రెవెన్యూ సదస్సులో 50 అర్జీలు



తడ, డిసెంబర్ 10 ప్రభాతవార్త : తడ మండలం గ్రద్దగుంట గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు మంచి స్పందన లభించింది. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించారు. స్మశానానికి దారి చూపించాలని, తాము అనుభవిస్తున్న పొలాలను సర్వే చేయించాలని, పాస్ బుక్‌లు ఇవ్వాలని తదితర సమస్యలపై రైతులు అధికా రులకు 50 అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శరత్‌బాబుతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, సర్పంచ్ కాటయ్య, రెవెన్యూ, సచివాలయ కార్యాలయాల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన

సూళ్లూరుపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన లభిస్తోందని తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని వెలగల పొన్నూరు పంచాయతీ, దామానెల్లూరు పంచాయతీ పరిధిలోని సుద్దమడుగు తాగేలి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 49 సమస్యలపై అర్జీల రూపంలో తహశీల్దార్‌కు అందాయి. ప్రస్తుతం వినతిపత్రాల ద్వారా వచ్చిన సమస్యలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చెప్పారు.



## మస్తాన్ రావు అభినందించిన ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త : రాజ్యసభ అభ్యర్థిగా బీద మస్తాన్ అవును ఎంపిక చేసిన సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ అభినందించారు. విజయవాడలో రాజ్యసభ అభ్యర్థులు మస్తాన్ రావు, సాన సతీష్ లను కలిసి వారికి అభినందనలు తెలిపారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు.

# గూడూరు డివిజన్

## రోగులకు దుప్పట్లు పంపిణీ

కోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : కోటలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో 80 మందిరోగులకు సాయిబాబా మందిరం (తూర్పువీధి) వారు దుప్పట్లు పంపిణీ చేశారు. దుప్పట్లు పంపిణీ చేసిన దాత పూర్ణచంద్రరావుకు ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపా కృతజ్ఞతలు తెలిపారు. చలికాలంలో ప్రభుత్వాసుపత్రిలో ఉంటున్న రోగులకు దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషకరమన్నారు. సేవ చేసే గుణం కొందరిలోనే ఉంటుందని చెప్పారు. వంద మందికి అన్నదాన కార్యక్రమం కూడా సాయిబాబా మందిరం వారు చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సారంగం విజయభాస్కర్ పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

సూళ్లూరుపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని జాతీయ రహదారిపై వట్రపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు (52) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇతను మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాలీబాల్ పోటీల్లో గోకులకృష్ణ విద్యార్థి ప్రతిభ



సూళ్లూరుపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీగోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జెఎన్‌టియు అనంత పురం వారి ఆధ్వర్యంలో కావలి ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన యూనివర్శిటీ స్థాయి వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చారు. గోకులకృష్ణ వాలీబాల్ టీమ్‌లో సభ్యుడైన పి.రాంజీ విశేష ప్రతిభ కనబరిచారు. దీంతో ఈ విద్యార్థిని యూనివర్శిటీ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి యూనివర్శిటీ టీమ్‌కు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## పుష్ప-2లో చౌడేపల్లి కుర్రాడు...!

**-గంధర్వుడికి అభినందనల వెల్లువ**

చౌడేపల్లి, నవంబర్ 10 ప్రభాతవార్త : పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ నటించి మెప్పించిన పుష్ప-2 సినిమాలో చౌడేపల్లి కుర్రాడు నటించాడు. దీంతో యువకుడిని అభినందనలతో ముంచెత్తుతు న్నారు. స్థానిక రామస్వామి ఆలయం వద్ద కాపురముండే దోనిపర్తి పార్థసారధి కుమారుడు దోనిపర్తి గంధర్వ కుమార్ ఇంజనీరింగ్ చేసి హైదరాబాదులో వుంటున్నాడు. ఈక్రమంలో పుష్ప-2 సినిమాలో అవకాశం రావడంతో అందులో నటించాడు. సినిమాలో శీను పాత్ర పోషించి తొలి సినిమాతోనే అందరినీ మెప్పించాడు. సినిమా తొలి అంకంలోనే అడవిలోకి వెళ్ళి ఎర్రచందనం దుంగలను దొంగలించే క్రమంలో పోలీసుకు చిక్కి స్టేషన్‌లో తన్నులు తినడం, పుష్పరాజ్ వచ్చి శీనును విడిపించుకొని పెళ్ళి చేసే సీను వరకు గంధర్వ కుమార్ నటనను ఇరగదీశాడు. పుష్ప-2తాను నటించి విషయాన్ని గంధర్వ గోప్యంగా వుంచాడు. చివరకు తల్లిదండ్రులకు సైతం చెప్పకుండా వున్నాడు. అయితే సినిమాను చూసిన స్థానికులు శీను పాత్రను పోషించింది మన గంధర్వ కుమారేనని ఆనోట ఈనోట పడి చివరకు దావానంలా వ్యాపించింది. దీంతో గ్రామస్తులు, చుట్టు పక్కల వారు రామస్వామి ఆలయం వద్దకు చేరుకొని శీను పాత్ర పోషించిన గంధర్వను ప్రశంసలతో ముంచెత్తారు. యువకుడు గతంలో 20-20క్రికెట్ నందు రాష్ట్రం తరపున ఆడి ప్రతిభను కనబరచాడు. ఎంచుకొన్న రంగంలో రాణిస్తున్న దోనిపర్తి గంధర్వకుమార్ మరింతగా ఎదగాలని అతని సన్నిహితులు, గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.



## విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

**-మానవ హక్కులు,నేర నియంత్రణ దళం చైర్మన్ మాదేష్**




గంగవరం,డిసెంబర్ 10 ప్రభాతవార్త: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని మానవ హక్కులు,నేర నియంత్రణ దళం చైర్మన్ మాదేష్ పిలుపునిచ్చారు. మండలంలోని సాయి శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ మానవ హక్కుల మరియు నేర నియంత్రణ దళం, పలమనేరు మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాదేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రశ్నించడం అలవాటు చేసుకుంటే ఎన్నో శాస్త్రీయ ఆలోచనలకు,నూతన ఆవిష్కరణలకు, అభివృద్ధికి దోహదపడు తుందన్నారు. ప్రతి విద్యార్థిలు ప్రశ్నించే తత్వాన్ని ఉపాధ్యాయులు, అధ్యా పకులు ప్రోత్సహించాలని కోరారు. భారత రాజ్యాంగంలో ప్రజల హక్కులను పొందుపరచడం జరిగిందని సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిం చుకోవాలని న్యాయం కోసం ప్రతి ఒక్కరు పోరాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఆరీపుల్లా ఖాన్,నేషనల్ సెక్రటరీ రాజేష్,నేషనల్ జనరల్ సెక్రటరీ త్యాగరాజులు, కోఆర్డినేటర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సి.మల్లవరం పంచాయతీలో... నిధుల దుర్వినియోగంపై విచారణ

**-ఉద్రిక్త వాతావరణం నడుమ డిఎల్‌పివో రికార్డ్స్ పరిశీలన**

తిరుపతిరూరల్,డిసెంబర్ 10 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచా యతీలో నిధుల దుర్వినియోగంపై మంగళవారం డిఎల్‌పివో సురేష్ నాయుడు విచారణ చేపట్టారు. కలెక్టర్ ప్రజాగ్రీవెన్స్ లో ఆర్.నవీన్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పంచాయతీ రికార్డ్స్ ను పరిశీలిం చడం జరిగిందని డిఎల్‌పిఓ తెలిపారు. సి.మల్లవరం గ్రామ పంచాయతీలో భారీ అవినీతి జరిగిందని, ప్లాన్ అప్రూవల్స్, నీటి కుళాయి కనెక్షన్స్, పంచాయతీ నిధులు, వాటర్ ప్లాంట్, పింఛన్‌లలో గోల్‌మాల్ జరిగినట్లు నవీన్‌కుమార్, మరికొందరు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ రికార్డ్స్ ను స్వాధీనం చేసుకుని పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. వార్డు సభ్యుల, గ్రామ ప్రజల విన్నపాలను వ్రాతపూర్వకంగా తీసుకున్నారు.



**సి.మల్లవరంలో ఉద్రిక్తత:**

సి.మల్లవరం గ్రామ పంచాయతీలో ఎలాంటి అవినీతి జరగలేదని, ఉద్దేశ పూర్వకంగానే టిడిపి విచారణ పేరుతో వేధిస్తున్నారని సర్పంచ్ మొక్కల భారతి ఆవేదన వ్యక్తం చేసారు. పంచాయతీలో అవినీతి జరగకపోతే విచారణ చేస్తే తప్పేంటని గామ టిడిపి అధ్యక్షుడు మనోహర్ చౌదరి ప్రశ్నించారు. డిఎల్పిఓ ఎదుటే ఒకరిపై మరోకరు వ్యక్తిగత ధూషణలకు పాల్పడ్డారు. నీవ్వెంత... నువ్వెంత...నీ అంతు చూస్తామనే రేంజ్‌లో గొడవలకు కాలు దువ్వారు. డిఎల్పిఓ హెచ్చరికతో గొడవ సర్దుమణిగింది. అనంతరం తిరుపతిరూరల్ పోలీసులు రావడంతో గొడవలు జరగలేదు. పంచాయతీ కార్యాలయంలో రికార్డ్స్ పరిశీలించుటకు ఇబ్బందికర వాతావరణం నెలకొని ఉండటంతో రికార్డ్స్ అన్నింటిని డిఎల్పిఓ కార్యాలయానికి తీసుకెళ్ళారు.

# అంగరంగవైభవంగా ఏడు గంగమ్మలకు సారె!

శ్రీకాళహస్తి,డిసెంబర్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు అంగరంగ వైభవంగా సారె బహూకరణ నిర్వహించారు. ప్రతి ఏడాది దేవస్థానం నుంచి ఏడు గంగమ్మలకు సారె బహూకరించే సంప్రదాయం, జాతర నిర్వహణలో దేవస్థానం కీలకమైంది.



**కన్నుల పండువగా సారె...**

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి మంగళ వారం సారె బహూకరణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో గంగమ్మలకు అందించే సారెను సిద్దం చేసారు. శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు హాజరు కాగా ఏర్పాట్ల ను ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షించారు.ఆలయ ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్ పూజలు నిర్వహించారు.ఆలయ పోరోహితులు అర్థగిరి స్వామి వేద మంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా సారె ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం నుంచి రాజగోపురం ద్వారా తేరువీధిలోకి ప్రవేశించింది. సారె తీసుకెళుతున్న అతిధుల కాళ్ళకు ఇంటింటా భక్తులు పసుపు నీళ్ళను సమర్పించారు. సారెను ఆయా గంగమ్మలను సమర్పించుకుంటూ ముత్యాలమ్మగుడివీధిలోనిఏడు గంగమ్మలు నిల్చు స్థలంలో సారెను సమర్పించారు. సారెతో పాటు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి దంపతులు,మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్,బిజెపి నాయకుడు కోలా ఆనంద్ కుమార్, కాసరం రమేష్, వజ్రం కిషోర్ హాజర య్యారు. సారెకు ముందు ఎలాంటి ఇబ్బందుల్లే కుండా డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ డి.గోపి పర్యవేక్షించారు.ట్రాఫిక్‌కు అంతరా యం లేకుండా ట్రాఫిక్‌ను ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయా ధికారులు ఇఓ టి.బాపిరెడ్డి డెప్యూటి ఇఓ ఎన్.ఆర్. కృష్ణారెడ్డి, ఎఇఓ లోకేష్‌రెడ్డి, హేమామాలిని, సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు, హరియాదవ్ ఎస్ఓ నాగభూషణం యాదవ్ తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్ఏతో పాటు బిజెపి నాయకుడు, మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, తెలుగుదేశం నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, కాసరం రమేష్, మాజీ కౌన్సిలర్ సుప్రజ, బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ గోపి సారథ్యంలో చక్కటి బందోబస్తు ఏర్పాటు చేసారు. కాగా పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

## గంగమ్మకు సారె సమర్పించిన మేయర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 10 ప్రభాతవార్త : తిరుపతి పెద్దకాపు వీధి నడివీధి గంగమ్మకు తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ గుడి నుండి మేళతాళా లతో మంగళవారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష సారె అందజేశారు. ప్రతి యేటా జరిగే పెద్ద కాపువీధి నడివీధి గంగమ్మ జాతర ఆనవాయితీగా ఆ గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు పాల్గొని నడివీధి గంగమ్మకు తాతయ్యగుంట గంగమ్మ గుడి నుండి మేళతాళాలతో సారె



అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రతి ఏటా పెద్దకాపు వీధిలో నడివీధి గంగమ్మకు ప్రత్యేక కుంభం వేసి, అంబిలుపోసి పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమ ంలో మేయర్‌తో పాటు గ్రామపెద్దలు, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, యాలమూరి శ్రీనివాసరెడ్డి, మునయ్య యాదవ్, డాక్టర్ మునిశేఖర్, శేఖర్ రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, భరణి యాదవ్, హేమంత్ కుమార్, నరేంద్ర,భక్తులు పాల్గొన్నారు.

## ఏడుగురు అక్కచెల్లెలకు విశేష అలంకారాలు





శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరలో ఏడు స్థావరాల్లో అమ్మవార్లకు వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. పెండ్లి మండపం పొన్నాలమ్మకు పుష్పప్రభ సింహావానంపై అమ్మవారికి శ్రీమహాకాళీ అలంకరణ. బేరివారి మండపం అమ్మవారిని ముత్యాలమ్మగా పిలుస్తారు.చంద్రప్రభ లో మయూర వాహనంను రూపొందిస్తున్నారు. భవాని అలంకారం చేస్తున్నారు. జయరామారావు వీధిలో అమ్మవారిని కావమ్మగా తీర్చి దిద్దుతున్నారు. సూర్యప్రభలో చిలుక వాహనంపై ప్రతిష్టించారు. మహాసింహ వాహనంపై మాధవేశ్వరి దేవి అలంకారం. సన్నిధివీధి గంగమ్మను గోపురంలో ప్రతిష్టిస్తున్నారు. అంకాళమ్మకు వైష్ణవి దేవి అలంకారం, ఆదిశేష పుష్పవాహనం రజత సింహావాహనంపై ప్రతిష్టించారు. తేరువీధిలోని జ్యోతి దేవలీల ప్రభలో నాగదేవతల మండపంలో నల్లగంగమ్మకు కామాక్షిదేవి ఆలంకారం నిర్వహిస్తున్నారు. గాంధీవీధిలోని అంకమ్మదేవతకు శ్రీచక్రత్రిశూలం ప్రభను రూపొదించారు. దేవకన్యల గజేంద్రవాహనంపై శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, కొత్త పేటలోని భువనేశ్వరి దేవికి ఏకవీర మీనాక్షి దేవి ఆలంకారం ఇంద్రప్రభ రథంలో సింహావాహనంపై అమ్మవారిని శోభాయమానంగా తీర్చి దిద్దారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ దంపతులతో పాటు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, మునిరాజనాయుడు, నెమళ్ళూరు.సుబ్రమణ్యం, జివిఅమర్నాధ్, మిన్నల్‌రవి, మల్లీశ్వరి, సుమతమ్మ, చంద్రమ్మ, మాజీ కౌన్సిలర్ అనిత, సుహాసిని పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




